కోటి సంతకాలతో ఎండగడతాం

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం బాలరాజు


కేఆర్‌పురంలో సంతకాల సేకరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


రాజానగరంలో సంతకాల సేకరణ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బుట్టాయగూడెం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం మండలంలోని కేఆర్‌పురం, రాజానగరంలో రచ్చబండ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే, పార్టీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఒక ప్రభంజనంలా చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో 50 వేల సంతకాలు సేకరించనున్నట్లు ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. వాటిలో ఏడు నిర్మాణం పూర్తి కాగా మరి కొన్ని పలు దశల్లో ఉన్నాయన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులకు కళాశాలలు అనువుగా ఉండేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. గిరిజన ప్రాంతంలోని ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో బుట్టాయగూడెంతో పాటు రాష్ట్రంలో మరో 6 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి కృషి చేశారని చెప్పారు. అయితే మల్టీ స్పెషాలిటీ పనులు నిలిచిపోగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనిని కోటి సంతకాల ద్వారానే ఎదుర్కొంటామని చెప్పారు. అలాగే ఈ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన చేయడమే కాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని చెప్పారు.

పార్టీ బలోపేతానికి కృషి

గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కేఆర్‌పురం, రాజానగరంలలో గ్రామ కమిటీల నియామకం నిర్వహించారు. గ్రామ కమిటీతో పాటు 7 అనుబంధ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమితులైన వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో ప్రస్తుతం నియమించబడిన కమిటీల ద్వారానే పరిపాలన చేస్తారన్నారు. పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సయ్యద్ బాజీ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వాణిజ్యవిభాగం జిల్లా అధ్యక్షులు తాళ్లూరి ప్రసాద్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు బగ్గి దినేష్, సర్పంచ్‌లు ఉయికే బొజ్జి, బన్నే బుచ్చిరాజు, ఎంపీటీసీ గాలి దుర్గారావు, నాయకులు కె. ప్రసాద్, కపిలవాయి హరిసూర్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్ విజయమ్మ పరామర్శ


మేడవరపు వరాలమ్మను పరామర్శిస్తున్న వైఎస్ విజయమ్మ

కామవరపుకోట: మండలంలోని కళ్లచెరువుకు చెందిన చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మేడవరపు అశోక్ మాతృమూర్తి వరాలమ్మ అనారోగ్యంగా ఉండటంతో బుధవారం వైఎస్ విజయమ్మ కళ్లచెరువు గ్రామానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అశోక్ కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు అభినందన


ఎమ్మెల్యే బాలరాజును అభినందిస్తున్న టీబీఆర్ యూత్ ప్రతినిధులు

బుట్టాయగూడెం: వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును టీబీఆర్ యూత్ ప్రతినిధులు దుద్దుకూరులో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా బాలరాజుకు శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టీబీఆర్ యూత్ ప్రతినిధులు తమ్మా రాజు, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బగ్గి దినేష్ మాట్లాడుతూ తెల్లం బాలరాజు నాయకత్వంలో తాము పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గణేష్, బిటి కొండ రాజు, పోడం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప స్వాములకు భిక్ష


మాలా ధారణ భక్తులకు వడి ప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అయ్యప్ప స్వాములకు వడి, భిక్ష (అన్నసమారాధన) కార్యక్రమాలు బుధవారం టెంపుల్స్ సెంటర్‌లోని అయ్యప్ప స్వామి మందిరం వద్ద నిర్వహించారు. దాతల సహకారంతో నాలుగు వందల మందికి పైగా అయ్యప్ప మాలధారణ భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వాహకులైన గురుస్వాములు నిర్వహించారు. మండల దీక్ష 41 రోజులపాటు వడి, భిక్ష కార్యక్రమాలు స్వాములకు నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా అయ్యప్ప మందిరంలో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా బయ్యన్నగూడెంలోని అయ్యప్పస్వామి మందిరం వద్ద పూజాది, అర్చన అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతున్న భిక్ష కార్యక్రమం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారణ స్వాములకు నిర్వహిస్తున్న భిక్ష కార్యక్రమం కొనసాగుతోంది. 14వ రోజు భిక్ష దాతలుగా జంగారెడ్డిగూడేనికి 0చెందిన కోరా రాము, సులోచన దంపతులు, శ్రీరామవరం గ్రామానికి చెందిన వంకాయల రాంబాబు, కృష్ణవేణి దంపతులు వ్యవహరించినట్లు అయ్యప్ప ఆలయ చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసుస్వామి తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కూనపార్వతి, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లేపర కృష్ణారావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు, ఆలయ మేనేజర్ గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

టి.నరసాపురం: జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో జి.మణికుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నూతనంగా జరిగిన మార్పులపై బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉపాధి శ్రామికులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆమె తెలిపారు. గత 12 రోజులుగా గ్రామ స్థాయిలో ఈకేవైసీ నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఏర్పాటు చేయండి


రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయం

కొయ్యలగూడెం: శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయ కమిటీ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సంవత్సరం క్రితమే కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉండగా నేతల మధ్య అభిప్రాయ భేదాలతో కమిటీ వేయకపోవడం ఆలయ కార్యక్రమాల నిర్వహణకు ఆటంకంగా నిలిచిందంటున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న స్వామి ఆలయానికి లక్షలాది రూపాయలు మాన్యాల ద్వారా ఆదాయం వస్తున్నప్పటికీ నిత్య కైంకర్యాలకు నోచుకోలేకపోతోందని భక్తులు వాపోతున్నారు. గత ప్రభుత్వ పాలనలో సుమారు రూ. 1.30 కోట్ల వ్యయంతో సుమారు 250 సంవత్సరాల క్రితం నాటి ఆలయాన్ని పునరుద్ధరించారు. ఆలయంలో ఉత్సవాలు, వైభవాలు పాత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ ఉండగా ప్రస్తుత కూటమి పాలకులు అభ్యంతరాలు తెలపడంతో నిలిచిపోయాయి.కార్తీక, మార్గశిర (ధనుర్మాసం) మాసాలు ప్రసస్త్యమైనవి కావడంతో పూజలు హోమాలు, వ్రతాలు నిర్వహించాల్సి ఉంది. ఈ లోపు పాలకమండలిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక


నూతన కమిటీని అభినందిస్తున్న జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ ఉత్తర్వుల మేరకు లక్కవరం గ్రామ కమిటీని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చిల్లా దుర్గారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఊసా జగ్గయ్య, పెన్నాడ రాంబాబు, పూల శ్రీను, ఆళ్ల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులుగా కొత్తూరి వెంకటేష్, జీరి పాపారావు, నిమ్మ శివారెడ్డి, కంభపు అప్పలరెడ్డి, బొప్పినేటి సూరిబాబు, ఎస్సీసెల్ అధ్యక్షుడు కూరాకుల సత్యనారాయణ, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సీహెచ్ విజయ్‌కుమార్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా చందమాల అరుణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావును మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో లక్కవరం సర్పంచ్ గెల్లా వెంకట రమణ, ఉపసర్పంచ్ నిమ్మ రామకృష్ణ, సీనియర్ నాయకులు వందనపు సూర్యప్రకాష్, మండల వైస్ ప్రెసిడెంట్ నిమ్మ గురునాధరెడ్డి, చిట్టిబొమ్మ శివరామకృష్ణ, సీనియర్ నాయకులు చండి రామకృష్ణ, యంత్రపాటి శివాజీ, సయ్యద్ ఆలీషా, నంబూరి బ్రహ్మాజీ, కొయ్య సతీష్‌రెడ్డి, ఈడా శ్రీను, పులివెంకటరెడ్డిలు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి


పాదయాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని రేపల్లెవాడ, వింజరం, ఇటుకల కోట మీదుగా పోలవరం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం పోలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర చేపట్టింది. బుధవారం రేపల్లెవాడ ప్రధాన కూడలి వద్ద సీనియర్ నాయకులు బొరగం భూచంద్రరావు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర బృందానికి ప్రజలు స్వాగతం పలికి తమ సమస్యలు తెలుపుకున్నారు. పాదయాత్ర రేపల్లెవాడ, చేగొండపల్లి, గుంజవరం, గార్లగొయ్యి, కొమ్ముగూడెం, ఇటుకలకోట, కచేరి (కార్మెల్ పురం) మీదుగా ఏటిగట్టు వరకు నిర్వహించారు. అనంతరం యాత్ర ముగింపు సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ రేపల్లెవాడ నుంచి పోలవరం రహదారిని 20 ఏళ్ల కిందట నిర్మించారని తెలిపారు. అప్పటి నుంచి ఈ రహదారిని అభివృద్ధి చేయకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. 2022లో రూ.6 కోట్ల నిధులను కేటాయించినా, నిర్మాణం చేపట్టలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారి అభివృద్ధి చేస్తున్నామంటూ ప్రచారం చేస్తున్నారే తప్ప నిధులు కేటాయించడం లేదన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు తామ బాలరాజు, చలపతిరావు, టి.శాంతికుమారి, గోకు రీ పాండవులు, కృష్ణ, నాగమణి, గంగాదేవి, పాల్గొన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: లోగ్రేడ్ వర్జీనియా పొగాకు కిలోకు రూ.300 ధర కల్పించాలని, రైతుల వద్దనున్న వర్జీనియా పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం తాడువాయిలో నిర్వహించిన ఏపీ రైతు సంఘం మండల సమావేశం ఆ సంఘ మండల అధ్యక్షుడు అనపర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ లోగ్రేడ్ వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నోబిడ్ పేరుతో తెచ్చిన పొగాకు బేళ్లను వెనక్కి పంపడంతో రవాణా ఖర్చుల భారం రైతులకు పెరిగిపోతుందని చెప్పారు. ఈ నెల 30, 31వ తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టినట్లు చెప్పారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, మండల ఉపాధ్యక్షుడు బోడిక రామచంద్రరావు, జల్లి ప్రసాద్, మాదారపు రవికుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్డులో కొలువైన శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రాంగణంలో సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారామ కల్యాణంతో పాటు భజన, పారాయణలు భక్తులు నిర్వహించారు. తొలుత బుధవారం సందర్భంగా వినాయక స్వామికి నిత్య కైంకర్యాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

'పది' విద్యార్థులపై దృష్టి పెట్టాలి


విద్యార్థులను పాఠ్యాంశాలను అడిగి తెలుసుకుంటున్న కొండలరావు

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ అడ్మిన్ ఐ.కొండలరావు అన్నారు. ఆయన బుధవారం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెం, నూతిరామన్నపాలెం, చేగొండపల్లి, జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలల పరిసరాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏ డీడీ పి.జనార్ధన్‌రావు, ఏటీడబ్ల్యూఓ పాల్గొన్నారు.

చేతులు శుభ్రత.. ఆరోగ్య భద్రత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లింగపాలెం: ప్రపంచ చేతులు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మండలంలోని కలరాయనగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థుల చేత చేతుల శుభ్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు టీచర్స్ ప్రసాద్, నాగేశ్వరావు, ఉమామహేశ్వరరావు, వెంకటలక్ష్మి, చంటిబాబు, రజని, వజ్రకుమార్, పద్మావతి పాల్గొన్నారు.

17న ఉచిత నేత్ర వైద్యశిబిరం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 17వ తేదీన జంగారెడ్డిగూడెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ ప్రతినిధి నిరంజన్ కుమార్ తెలిపారు. ఏలూరు వైభవ్ ఆదర్శ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు 9346810361 నెంబరును సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


పోటీలకు ఎంపికైన వేముల రాకేష్, హిమశ్రీ

కామవరపుకోట: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంటా రవిచంద్ర మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఏలూరు జిల్లా పెదవేగి గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అండర్-19 విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థి వేముల రాకేష్ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మానకొండ సుబ్బారావును, ఎంపికైన విద్యార్థిని పాఠశాల సిబ్బంది గ్రామస్తులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు హిమశ్రీ

బుట్టాయగూడెం: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని ఎం.హిమశ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సుబ్బలక్ష్మి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బుధవారం బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కాలేజీ పెదవేగిలో జరిగిన అండర్-19 హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి సెలక్షన్‌లో హిమశ్రీ అత్యంత ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. కాగా హిమశ్రీకి ఆటల్లో శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్. సీతారామ్, టి. శ్రీనివాస్‌లను హెచ్ఎమ్ అభినందించారు.

అతిథి ఉపన్యాసం

జంగారెడ్డిగూడెం: పుట్ట గొడుగుల పెంపకంపై వృక్ష శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాస కార్యక్రమం స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ పాఠ్య ప్రణాళికలో భాగంగా రోజువారీ ఉపన్యాసాలతో పాటు అప్పుడప్పుడు ఇలాంటి అతిథి ఉపన్యాసాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. విజయవాడ ఎస్ఆర్ ఆర్, సీవీఆర్ అటానమస్ కాలేజీ అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు పుట్టగొడుగులు, వాటి ప్రాముఖ్యత, పెంపకం, సాగు వల్ల కలిగే లాభాలు, ప్రయోజనాలు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ ఎం.మధు, అధ్యాపకులు టీవీ రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం


కలాం జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని, విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని రాణించాలని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం 94వ జయంతి కార్యక్రమం లైబ్రరీలో సంఘ ఆధ్వర్యంలో నిర్వహించారు. అబ్దుల్ కలాం జయంతిని ఐక్యరాజ్యసమితి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా ప్రకటించడం భారతీయులకు గర్వకారణమన్నారు. సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, కండెల్లి శివ, రాయపూడి వెంకట రమణ, జవ్వాది శ్రీనివాసరావు, దాసరోజు చంద్రశేఖర్, ఎస్‌కే బాజీ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

జంగారెడ్డిగూడెం: పేపర్ బాయ్ నుంచి రాకెట్ మాన్ వరకు ఏపీజే అబ్దుల్ కలాం జీవిత చరిత్రను విద్యార్థులు చదువుకొని స్ఫూర్తి పొందాలని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ హెచ్ఎం పట్నాల సోమశేఖర్ అన్నారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యార్థుల దినోత్సవం నిర్వహించారు. కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు శివ ప్రసాద్, పాఠశాల సెక్రెటరీ ఎంఏ నబి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన అలివేరులో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు. అదే విధంగా జల్లేరు జలాశయం రబీ సీజన్‌కు సంబంధించిన నీటిని విడుదల చేశారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కారం లక్ష్మి, తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ లత, ఎంపీడీఓ కె. జ్యోతి, సీడీపీవో పాల్గొన్నారు.

ఆరోగ్యవంత మహిళలే సమాజానికి శక్తి

బుట్టాయగూడెం: ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన సమాజానికి పునాదని ఐసీడీఎస్ సీడీపీఓ యూవీ పద్మావతి అన్నారు. మండలంలోని కొమ్ముగూడెంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నాగమణి, పి.విజయలక్ష్మి, జి.దయామణి, కె.వెంకటలక్ష్మి, శ్యామల, సుధ, లలిత పాల్గొన్నారు.